

సైనికులే నిజమైన హీరోలు 8లో



వీరుడా.. వందనం 8లో



వసూళ్లపై శ్రద్ధ.. దేవుడిపై అశ్రద్ధ 8లో



పెదగంట్యాడ మండలం నెల్లిముక్కు బీసీ బాలుర హాస్టల్‌లో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు

# కష్టాలే వసతి.. కన్నీళ్లే గతి

- ప్రభుత్వ వసతి గృహాల్లో దుర్భర పరిస్థితులు
- కటిక నేలపై నిద్ర.. గుక్కెడు నీటి కోసం ఆరాటం..
- నాణ్యత లేని భోజనంతో విద్యార్థుల అవస్థలు
- సగానికి పైగా అద్దె భవనాల్లోనే..
- ఇరుకు గదుల్లోనే స్టూడెంట్స్ సావాసం

కటిక నేలపై నిద్ర.. గొంతు తడుపుకోవడానికి గుక్కెడు సురక్షితమైన నీళ్ల కోసం ఆరాటం.. నాణ్యత లేని, అరకొర భోజనంతో అర్ధాకలితో అక్షరాలు దిద్దాల్సిన దుస్థితి.. ఇదీ జిల్లాలోని వసతి గృహాల్లో చదువుకుంటున్న విద్యార్థుల రోజూవారీ జీవన చిత్రం. అద్దె భవనాలు, వర్షం పడితే చెమ్మ బారుతున్న గదులు, తలుపులు లేని కిటికీలు, పగిలిన నేలపైనే వారి సహవాసం. బాలికలకు కనీస అవసరాలు తీరడం లేదు. అనారోగ్యం వస్తే చూసే దిక్కు ఉండదు. కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణ లోపం వారిని అష్టకష్టాల పాల్జేస్తోంది. విజ్ఞాన జ్యోతులు వెలిగించాల్సిన ప్రభుత్వ వసతి గృహాలు.. ఇలా అధ్వాన పరిస్థితులకు నిలయాలుగా మారిపోయాయి. 'సాక్షి' క్షేత్రస్థాయి పరిశీలనలో వెలుగు చూసిన అంశాలు ప్రభుత్వ వైఫల్యానికి అద్దం పడుతున్నాయి.

- సాక్షి నెట్‌వర్క్

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

జిల్లాలో మొత్తం 55 ప్రభుత్వ వసతి గృహాలు అందుబాటులో ఉన్నాయి. ఇందులో బీసీ సంక్షేమ శాఖ ద్వారా 30 వసతి గృహాలు, సాంఘిక సంక్షేమ శాఖ ద్వారా 22, మరో మూడు ఎస్టీ వసతిగృహాలు నడుస్తున్నాయి. 30 బీసీ వసతిగృహాల్లో 12 ప్రీ-మెట్రిక్, 18 పోస్ట్-మెట్రిక్‌గా సేవలు అందిస్తున్నాయి. 22 ఎస్సీ వసతి గృహాల్లో 8 ప్రీ-మెట్రిక్ (4 బాలుర, 4 బాలికల), 14 పోస్ట్-మెట్రిక్ (6 బాలుర, 8 బాలికల) వసతి గృహాలు ఉన్నాయి. మరో మూడు గిరిజన వసతి గృహాలు (1 బాలికల, 2 బాలుర) విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి.



సీతమ్మధారలోని ఎస్సీ కాలేజీ హాస్టల్‌లో వాష్ బేసిన్‌లు మరమ్మతులకు గురవడంతో.. దుస్తులు ఉతుక్కునే చోట ప్లేట్లు కడుక్కుంటున్న విద్యార్థి.. నాచు పట్టిన పరిసరాలు

## అపరిశుభ్రత, అసౌకర్యాలు



సీతమ్మధారలోని ఎస్సీ కాలేజీ హాస్టల్‌లో కుళాయిల దుస్థితి ఇది

జిల్లాలోని మొత్తం 55 ప్రభుత్వ వసతి గృహాల్లో సగానికి పైగా అసౌకర్యాలతో నిండి ఉన్నాయని 'సాక్షి' పరిశీలనలో వెల్లడైంది. 30 బీసీ వసతి గృహాలలో సగానికి పైగా అద్దె భవనాలలో కొనసాగుతున్నాయి. ఈ భవనాలకు దశాబ్దాలుగా మరమ్మతులు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సురక్షితమైన తాగునీరు అందుబాటులో లేకపోవడం ప్రధాన సమస్యగా ఉంది. కొన్ని చోట్ల నీరు బ్లీచింగ్ వాసన వస్తోందని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థులు కటిక నేలపై, కొన్ని చోట్ల దుప్పట్లు/ప్లెక్సీలు పరచుకుని నిద్రపోతున్నారు. కొన్ని చోట్ల మంచాలు, దుప్పట్లు వంటివి అందుబాటులో లేవు. ఆహారంలో నాణ్యత లోపించడం, సమయానికి ఆహారం సిద్ధం కాకపోవడం వల్ల విద్యార్థులు అర్ధాకలితోనే చదువులు కొనసాగిస్తున్నారు. అవసరమైన వైద్య వసతులు, బాలికలకు అవసరమైన కిట్లు కూడా ప్రభుత్వం అందించడం లేదు. ఇక వసతి గృహాల పరిసరాలు కూడా అధ్వానంగా ఉన్నాయి. విద్యార్థులు తమ దైనందిన కార్యకలాపాలు సాగిస్తున్న గదుల్లో ఫ్లోరింగ్ మరమ్మతులకు గురైంది. విద్యార్థులు తమ వస్తువులను భద్రపరచుకునే పెట్టెలను ఈ పగిలిన ఫ్లోరింగ్ పక్కనే ఉంచుకుంటున్నారు. తోటగరువులోని హాస్టల్‌లో 122 మంది విద్యార్థులు కేవలం 120 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న రెండు గదుల్లో వసతి పొందుతున్నారు. ఫిబ్రవరి నుంచి విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు అందడం లేదు. ఇలా విద్యార్థులు ఉన్న సౌకర్యాలతోనే దయనీయంగా చదువులు కొనసాగిస్తున్నారు.



సీతమ్మధారలోని ఎస్సీ కాలేజీ హాస్టల్‌లో ఆహార వ్యర్థాలతో నిండి దుర్వాసన వస్తున్న డ్రైనేజీ



మధురవాడ ఎస్సీ బాలుర కళాశాల హాస్టల్‌లో పగిలిన కిటికీ అద్దాలు. అట్ట ముక్కలు అడ్డుగా పెట్టుకుని కాలం వెళ్లదీస్తున్న విద్యార్థులు



గాంధీనగర్ హాస్టల్‌లో నీరు తీసుకెళ్తున్న విద్యార్థి

## పలు వసతిగృహాల్లో ఇదీ పరిస్థితి

కంచరపాలెం ఊర్వశి కూడలి సమీపంలోని గిరిజన బాలుర పోస్ట్‌మెట్రిక్ వసతిగృహంలో విద్యార్థులు నేలపై నిద్రపోతున్నారు. వర్షం పడినప్పుడు గదుల్లోకి నీరు చేరి నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు.

- సీతమ్మధార ఎస్సీ వసతి గృహంలో వాటర్‌ప్లాంట్ మూలకు చేరింది. పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. దుప్పట్లు, మంచాలు వంటి సౌకర్యాలు లేవు. ట్యాప్‌లు సరిగా లేక నీరు వృథా అవుతోంది.
- ఎంవీపీ కాలనీ సెక్టార్-4లోని బీసీ బాలికల వసతి గృహం దశాబ్దాలుగా అద్దె భవనంలో నడుస్తోంది. సురక్షిత తాగునీరు లేదు. ఇరుకు గదుల్లో నేలపై నిద్రపోతున్నారు.
- మాధవధారలోని గిరిజన వసతి గృహంలో విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. ఇక్కడ 300 మంది వరకు విద్యార్థులకు వసతి కల్పించారు. వీరంతా నగరంలోని వివిధ కళాశాలల్లో చదువుకుంటున్నారు. ఉదయం కళాశాలకు వెళ్లే సమయానికి వంట పూర్తికాక.. కేవలం అన్నంతోనే భోజనం తీసుకెళ్తున్నారు. ఉదయం 2 గంటలు మాత్రమే నీరు రావడంతో నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. తాగునీరు బ్లీచింగ్ వాసన వస్తోంది.
- తోటగరువు గాంధీనగర్‌లోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆవాసీయ విద్యాలయ బాలుర హాస్టల్‌లో కనీస సౌకర్యాలు కరువయ్యాయి. 122 మంది విద్యార్థులు 120 చదరపు గజాల విస్తీర్ణంలోని రెండు గదుల్లో వసతి పొందుతున్నారు. తాగునీటి కష్టాలు, నేలపై నిద్ర, వైద్య సదుపాయాల కొరత వేధిస్తోంది.
- పెదగంట్యాడ మండలం నెల్లిముక్కులో సోషల్ వెల్ఫేర్ ఎస్సీ, ఎస్టీ బాలికల హాస్టల్‌తో పాటు బీసీ కాలేజ్ బాయ్స్ హాస్టల్ ఉన్నాయి. బాయ్స్ హాస్టల్‌లో మొత్తం 89 మంది ఉండగా, నాలుగు గదులు అందుబాటులో ఉన్నాయి. ఇందులో ఒక గదిని కార్యాలయంగా వినియోగిస్తున్నారు. ఆయా గదుల్లో మంచాలు లేకపోవడంతో నేలపైనే విద్యార్థులు నిద్రపోతున్నారు. ఎస్సీ, ఎస్టీ బాలికల హాస్టల్‌లో కూడా ఇదే పరిస్థితి నెలకొంది.
- 74వ వార్డు పరిధిలోని సిద్దేశ్వరంలో బాలికల హాస్టల్ ఉంది. ఇందులో ఇంటర్ నుంచి బి.టెక్ చదువుతున్న 50 మంది విద్యార్థినులు ఉన్నారు. అద్దె భవనంలోనే ఈ హాస్టల్‌ను నిర్వహిస్తున్నారు.
- సింహాచలం మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో డార్మిటరీ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా మారింది.
- పరవాడ బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు దుప్పట్లు, రగ్గులు సరఫరా చేయలేదు.
- కప్పరాడ గిరిజన బాలుర పోస్ట్ మెట్రిక్ వసతి గృహంలో లైట్లు, ఫ్యాన్లు సక్రమంగా పనిచేయడం లేదు.
- భీమిలిలోని బీసీ బాలుర కళాశాల వసతి గృహంలో పూర్తి స్థాయిలో మరుగుదొడ్లు లేకపోవడంతో.. విద్యార్థులు ఆరుబయటకు వెళ్తున్నారు.



సీతమ్మధార సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో మూలకు చేరిన ఆర్వో ప్లాంట్



గాంధీనగర్ హాస్టల్‌లో ఇదీ పరిస్థితి.. పాడైన మరుగుదొడ్డి తలుపు, శిథిలావస్థకు చేరిన కిటికీ

## వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సకల హంగులు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోని ప్రభుత్వ వసతి గృహాలను సకల సౌకర్యాలతో ఆధునీకీకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా యంత్రాంగం సీఎస్సార్ నిధులను భారీగా సేకరించి.. హాస్టళ్లలో సౌకర్యాల కల్పనకు వినియోగించింది. దివీస్ ల్యాబ్స్, కోరమండల్ వంటి సంస్థలు, ఎంపీ లాడ్స్ నిధులతో జిల్లాలోని 10 వసతి గృహాల్లో మొత్తం రూ.3.66 కోట్లతో ఆధునిక సౌకర్యాలు కల్పించారు. నడుపూరు సోషల్ వెల్ఫేర్ బాలికల వసతి గృహాన్ని రూ.70 లక్షలతో, పెదగంట్యాడ బాలికల వసతి గృహాన్ని రూ.23 లక్షలతో, భీమిలి ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ హాస్టల్‌ను రూ.55 లక్షలతో, భీమిలి బీసీ కాలేజ్ హాస్టల్‌ను రూ.41.62 లక్షలతో, పరదేశిపాలెం సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్‌ను రూ.22.67 లక్షలతో, భీమిలి బీసీ బాలికల హాస్టల్‌ను రూ.34.79 లక్షలతో, ఇసుకతోట బీసీ బాలుర హాస్టల్‌ను రూ.34 లక్షలతో, ఆనందపురం బీసీ బాలుర హాస్టల్‌ను రూ.30 లక్షలతో, పెందుర్తి ఎస్సీ బాలుర హాస్టల్‌ను రూ.28.60 లక్షలతో, గోపాలపట్నం ఎస్సీ బాలుర హాస్టల్‌ను రూ.27.10 లక్షలతో ఆధునికీకరించారు. దీంతో అక్కడి విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన వసతి సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయి.






ఆధునికీకరించిన గోపాలపట్నం, పెందుర్తి హాస్టళ్లు

# మేయర్ ఇంటి సమీపంలో బెల్ట్ దుకాణం

**50 మద్యం క్వార్టర్ బాటిళ్ల స్వాధీనం**



బెల్ట్ దుకాణంలో పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు

**పెందుర్తి:** కూటమి ప్రభుత్వ హయాంలో మద్యం బెల్ట్ దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయి. జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావు నివాసానికి కూత వేటు దూరంలో శుక్రవారం అర్ధరాత్రి ఓ మద్యం బెల్ట్ దుకాణం బాగోతం బయటపడింది. వివరాలివి..ఆనందపురం మండలం శొంఠ్యాం గ్రామానికి చెందిన ఎర్ర మాధవ్ పెందుర్తి కూడలి సమీపంలోని డీఆర్‌సీ షాపింగ్ మాల్ ఎదురుగా మద్యం బెల్ట్ దుకాణం నిర్వహిస్తున్నాడు. దీనిపై పక్కా సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో దుకాణంపై మెరుపుదాడి చేశారు. దుకాణంలో ఉన్న 50 మద్యం క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు ప్రయత్నం చేసిన నిందితుడు మాధవ్‌ను హెచ్‌సీ జి.అప్పారావు, పీసీ చంద్రశేఖర్ చాకచక్యంగా పట్టుకుని అదుపులోనికి తీసుకున్నారు. సీఐ సతీస్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బీఈఎంఎల్‌తో షిప్‌యార్డ్ ఒప్పందం

**సాక్షి, విశాఖపట్నం:** మెరైన్ వ్యవస్థ, షిప్‌యార్డుల అత్యాధునికీకరణ, సాంకేతికతను అందిపుచ్చుకునేలా భారత్ ఎర్త్ మూవర్స్ లిమిటెడ్(బీఈఎంఎల్)తో హిందూస్థాన్ షిప్‌యార్డ్(హెచ్ఎస్ఎల్) వ్యూహాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. ఇందులో భాగంగా షిప్‌యార్డు ప్రధాన కార్యాలయంలో హెచ్ఎస్ఎల్ సీఎండీ కమొడర్ హేమంత్ ఖత్రి, బీఈఎంఎల్ సీఎండీ శాంతాను రాయ్ ఒప్పంద పత్రాలపై శనివారం సంతకాలు చేసి ఎంఓయూలు మార్చుకున్నారు. స్వదేశీ సముద్ర సామర్థ్యాలను అభివృద్ధి చేయడంతో పాటు నౌకా నిర్మాణంలో సరికొత్త ఆవిష్కరణలు, అత్యాధునిక సాంకేతికత, సహకారం ఇరు సంస్థల మధ్య కొనసాగుతుందని సీఎండీ ఖత్రి స్పష్టం చేశారు. ఆత్మ నిర్భర్ భారత్‌కు ఈ అవగాహన ఒప్పందం ఒక కీలక మైలురాయిని సూచిస్తుందని ఖత్రి స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే అన్ని స్థానాలు వైఎస్సార్ సీపీవే..



జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్.ఎస్.వర్మకు వైఎస్సార్‌సీపీ తరఫున స్థాయీ సంఘ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థుల నామినేషన్ పత్రాలు అందజేస్తున్న కేకే రాజు

**స్థాయీ సంఘ ఎన్నికల్లో నామినేషన్లు దాఖలు**

**డాబాగార్డెన్స్:** ప్రజాస్వామ్యబద్ధంగా జీవీఎంసీ స్థాయీ సంఘం ఎన్నికలు నిర్వహిస్తే పదికి పది స్థానాలు వైఎస్సార్ సీపీవేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తెలిపారు. స్థాయీ సంఘ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ తరఫున పోటీ చేసే అభ్యర్థులు శనివారం జీవీఎంసీ అదనపు కమిషనర్ ఎస్ఎస్ వర్మకు నామినేషన్లు దాఖలు చేశారు. అనంతరం కేకే రాజు మాట్లాడుతూ స్థాయీ సంఘం ఎన్నికకు సంబంధించి 97 మందిని ఓటర్లుగా గుర్తిస్తూ నోటిఫికేషన్ ఇచ్చారన్నారు. ఏప్రిల్‌లో జరిగిన మేయర్ అవిశ్వాస తీర్మానంలో వైఎస్సార్ సీపీ జెండాపై గెలిచిన 27 మంది పార్టీ విప్‌ను ధిక్కరించి ఓటు వేయగా.. వారిపై అనర్హత వేటు వేయాలని ప్రిసైడింగ్ అధికారి, కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేయడం జరిగిందన్నారు. అంతేగాక హైకోర్టులో 27 మంది అనర్హత కేసు నడుస్తుండగా స్టాండింగ్ కమిటీ నోటిఫికేషన్ జారీ చేశారన్నారు. టెక్నికల్‌గా 27 మందికి ఓటు హక్కు ఉంటే వైఎస్సార్ సీపీ బలం 59గా ఉన్నట్టేనని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం.. అధికార దుర్వినియోగం చేస్తేనే తప్పా.. వారు ఎట్టి పరిస్థితుల్లోనూ గెలవలేరన్నారు. యాక్ట్ ప్రకారం విప్ జారీ చేయడం జరిగిందని, కోర్టును కూడా ఆశ్రయించామని, చట్ట ప్రకారం వారు (పార్టీ ఫిరాయించిన 27 మంది) అనర్హులని చెప్పారు. న్యాయ స్థానంలో కేసు పెండింగ్‌లో ఉందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, పార్టీ విప్ తైనాల విజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, పార్టీ కార్యాలయ పర్యవేక్షకుడు రవిరెడ్డి, వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, మాజీ రాష్ట్ర కార్యదర్శి గొలగాని శ్రీనివాస్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు అక్కరమాని పద్మ, రామునాయుడు, దొలపల్లి ఏడుకొండలాలు, కోరుకొండ వెంకట రత్న స్వాతి దాస్, కటారి అనిల్‌కుమార్, భూపతిరాజు సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వల సురేష్, జిల్లా అధికార ప్రతినిధి పల్లా దుర్గ, జిల్లా కార్యదర్శి ఉమ్మడి దాస్, 41వ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# బయోమెట్రిక్ హాజరు పర్యవేక్షణకు ఆదేశం

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరును పర్యవేక్షించాలని కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ ఆదేశాలు జారీ చేసింది. కొంత మంది ఉద్యోగులు బయోమెట్రిక్ తొలి హాజరు నమోదు చేసిన అనంతరం విభాగాలు, ప్లాంట్ వదిలి వెళ్లి తిరిగి చివరి హాజరుకు వస్తున్నట్టు తెలిసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఉద్యోగుల బయోమెట్రిక్ హాజరుపై ఆకస్మిక తనిఖీ చేయాలని ఉక్కు మంత్రిత్వశాఖ అండర్ సెక్రటరీ తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీనిపై ఉక్కు యాజమాన్యం సమీక్ష నిర్వహించి సంబంధిత విభాగాలకు ఇందుకు సంబంధించిన ఆదేశాలు జారీ చేసినట్టు సమాచారం.

# దుర్గానగర్ వద్ద రోడ్డు మూసివేత

- ఉక్కు యాజమాన్యం తీరుపై ప్రజల ఆందోళన
- కలెక్టర్ హరేంధిరప్రసాద్ ఆగ్రహం
- గంటల వ్యవధిలో కంచె తొలగింపు

**గాజువాక :** గంగవరం పోర్టు వై జంక్షన్ నుంచి విశాఖ స్టీల్‌ప్లాంట్ వరకు గల ప్రధాన రహదారిని దుర్గానగర్ జంక్షన్ వద్ద స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం మూసివేసింది. అక్కడ ఒక రైతుతో ఏర్పడిన భూవివాదంలో కోర్టు నుంచి రైతుకు అనుకూలంగా ఉత్తర్వులు వెలువడటంతో స్టీల్‌ప్లాంట్ ఈ చర్యలకు దిగింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్ తీవ్రంగా స్పందించారు. దశాబ్దాల తరబడి మనుగడలో ఉన్న రోడ్డును మూసివేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గాజువాక తహసీల్దార్ బి.శ్రీనివాసరావు ఆ కంచెను గంటల వ్యవధిలో తొలగించారు. వివరాల్లోకి వెళ్తే.. పాతకర్ణవానిపాలెం నుంచి స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రహదారిలో దుర్గానగర్ వద్ద సర్వే నంబర్ 215లోని వివిధ సబ్ డివిజన్లలో కొంత భూమిని అప్పట్లో స్టీల్‌ప్లాంట్ తీసుకోలేదు. ఇప్పటికీ అది జిరాయితీగానే ఉంది. అయినప్పటికీ అందులో స్టీల్‌ప్లాంట్ రోడ్డు నిర్మించింది. ఆ భూమి తనదని, తనకు నష్టపరిహారం ఇవ్వకుండా రోడ్డు వేయడం సరికాదంటూ వెంకట రమణ అనే వ్యక్తి హైకోర్టును 2021లో ఆశ్రయించాడు. నిబంధనల ప్రకారం ఈ సమస్యను పరిష్కరించాలని సూచిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అయినా ఆ సమస్య అలాగే ఉండటంతో ఆ వ్యక్తి మరోసారి కోర్టును ఆశ్రయించాడు. స్టీల్‌ప్లాంట్ సీఎండీపై కోర్టు ధిక్కరణ కేసు వేశాడు. దీంతో ఆ రోడ్డు తమకు అవసరం లేదని పేర్కొంటూ స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం దుర్గానగర్ వద్ద రోడ్డును మూసివేసింది. పరవాడ, అచ్యుతాపురం, యలమంచిలి, ఫార్మాసిటీ వంటి ప్రాంతాలకు ఇది దగ్గర మార్గం కావడంతో ప్రజలు వేల సంఖ్యలో ఈ రోడ్డులోనే రాకపోకలు సాగిస్తారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులతోపాటు ఆ సంస్థకు వచ్చే భారీ వాహనాలు కూడా ఆ రోడ్డే ఉపయోగపడుతోంది. దుర్గానగర్ సమీపంలోని వివిధ అపార్ట్‌మెంట్‌వాసులకు, వివిధ లాజిస్టిక్ కంపెనీలు ఈ రోడ్‌ను ఉపయోగిస్తాయి. ఎంతో ఉపయోగకరమైన ఈ రోడ్డును మూసివేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**తహసీల్దార్ పరిశీలన**

స్టీల్‌ప్లాంట్ రోడ్డును మూసివేయడంతో కలెక్టర్ హరేంధిరప్రసాద్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు గాజువాక తహసీల్దార్ బి.శ్రీనివాస్ ఆ రోడ్డును పరిశీలించారు. పూర్తి వివరాలను స్థల యజమానిని అడిగి తెలుసుకొని కలెక్టర్‌కు నివేదించారు. రోడ్డును అందుబాటులోకి తేవాలని కలెక్టర్ ఆదేశించడంతో అడ్డంగా వేసిన కంచెను శనివారం రాత్రి తొలగించారు. అధ్యయనం చేసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దార్ తెలిపారు.



రోడ్డుకు అడ్డంగా స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు చేసిన బారికేడ్

# సమష్టి కృషితోనే జీవీఎంసీకి గుర్తింపు

**మేయర్ పీలా శ్రీనివాసరావు**

**మహారాణిపేట:** పారిశుద్ధ్య కార్మికుల సమష్టి కృషితోనే సఫాయి మిత్ర సురక్షిత్ షహర్ ప్రత్యేక కేటగిరీలో జీవీఎంసీకి ప్రథమ స్థానం దక్కిందని మేయర్ పీలా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం ఏయూ కన్వెన్షన్‌లో జీవీఎంసీ నిర్వహించిన స్వచ్ఛ అవార్డుల సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నగరాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దిన పారిశుద్ధ్య కార్మికులకే ఈ అవార్డు దక్కుతుందన్నారు. జీవీఎంసీ పరిధిలో పారిశుద్ధ్య కార్మికులను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీ ఎం.శ్రీభరత్ మాట్లాడుతూ మంచి టెక్నాలజీని అందిపుచ్చుకొని విశాఖ నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు అందరూ కృషి చేయాలన్నారు. కలెక్టర్ ఎం.ఎన్ హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ అందరూ కలిసి పని చేస్తే మరిన్ని అవార్డులు జీవీఎంసీకి దక్కుతాయని పేర్కొన్నారు. జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ మాట్లాడుతూ కష్టపడి పనిచేయడం వల్ల జీవీఎంసీకి స్వచ్ఛతలో మొదట ర్యాంకు వచ్చిందన్నారు. పారిశుద్ధ్య కార్మికులు, కార్యదర్శులు, యూసీడీ సిబ్బంది, పలు ఎన్‌జీవోలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లను సత్కరించి స్వచ్ఛ అవార్డులను, ప్రశంసా పత్రాలను జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు, డిప్యూటీ మేయర్ దల్లి గోవింద రాజు, ఏపీ ఆయిల్ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జి, డీసీసీబీ చైర్మన్ కోన తాతారావు, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్, జీవీఎంసీ అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, యూసీడీ పీడీ సత్యవేణి, జోనల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందిని సత్కరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

# ఎస్సీ, ఎస్టీ కోర్టు ఇన్‌చార్జి ఏపీపీగా రాజశేఖర్



**విశాఖ లీగల్:** నగరంలోని షెడ్యూల్ కులాలు, తెగల ప్రత్యేక న్యాయస్థానం ఇన్‌చార్జి అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది భత్తి రాజశేఖర్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ న్యాయ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం రాజశేఖర్ నగరంలోని పోక్సో ప్రత్యేక న్యాయస్థానం పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పని చేస్తున్నారు. ఈ కోర్టుతోపాటు ఎస్సీ, ఎస్టీ కోర్టులోని అన్ని క్రిమినల్ కేసులను ప్రాసిక్యూషన్ తరఫున వాదిస్తారు. ప్రభుత్వం నుంచి తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏపీపీగా కొనసాగుతారు.

# స్టీల్‌ప్లాంట్ ఉన్నత ఉద్యోగి ఇంట్లో మద్యం పట్టివేత

- దేశ, విదేశీ, డిఫెన్స్‌కు చెందిన 67 బాటిళ్ల స్వాధీనం
- ఈ నెలాఖరున పదవీ విరమణ
- మహిళలతో అసభ్య ప్రవర్తన
- తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగి
- పరారీలో స్టీల్ జీఎం రవికుమార్





స్టీల్‌ప్లాంట్ జీఎం రవికుమార్ ఇంట్లో దొరికిన మద్యం బాటిళ్లు

**పెందుర్తి:** స్టీల్ ప్లాంట్‌లో ఉన్నత ఉద్యోగి ఇంట్లో భారీ ఎత్తున నిల్వ చేసిన మద్యం బాటిళ్లను పెందుర్తి ఎక్సైజ్, ప్రోహిబిషన్ పోలీసు లు స్వాధీనం చేసుకున్నారు. మధురవాడలోని ఎంవీవీ సిటీలో నివాసం ఉంటున్న స్టీల్‌ప్లాంట్ సివిల్, స్ట్రక్చరల్ ఇంజినీరింగ్ విభాగం హెడ్ పసుపులేటి రవికుమార్ ఇంట్లో భారీ ఎత్తున మద్యం నిల్వ చేసినట్లు ఎక్సైజ్ పోలీసులకు సమాచారం అందింది. దీంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ ఆదేశాల మేరకు పెందుర్తి ఎక్సైజ్, ప్రోహిబిషన్ సీఐ సరోజాదేవి ఆధ్వర్యంలో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ ముసలి నాయుడు బృందం శనివారం దాడి చేశారు. విదేశీ మద్యం బాటిళ్లు 18, డిఫెన్స్ 16, ఒడిశా 1, గోవా 1, తెలంగాణ 11, హర్యానా 7, మహారాష్ట్ర 2, ఆంధ్రప్రదేశ్ 9, విడి మద్యం 2 బాటిళ్లు (మొత్తం 67 ఫుల్ బాటిళ్లు)ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు రవికుమార్ పరారీలో ఉన్నట్లు పెందుర్తి ఎక్సైజ్, ప్రోహిబిషన్ సీఐ సరోజాదేవి పేర్కొన్నారు. రవికుమార్ ఇంట్లో మద్యం అక్రమ నిల్వ వ్యవహారంపై ఎక్సైజ్ పోలీసులకు గత వారం రోజులుగా ఫిర్యాదులు వస్తున్నట్లు తెలుస్తోంది.

**రవి లీలలు ఎన్నో..?**

నిందితుడు రవికుమార్ స్టీల్‌ప్లాంట్ జీఎం హోదాలో ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్నారు. కాగా రవికుమార్‌పై ప్లాంట్‌లో అనేక ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. తన విభాగంలో శాసించే హోదాలో ఉండడంతో నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తానని చెప్పి వసూళ్లకు పాల్పడినట్లు ప్రచారం జరుగుతోంది. ప్రత్యేకంగా స్టీల్‌ప్లాంట్లో ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తున్న యువతులను లొంగతీసుకోవడం అతనికి అలవాటు మారిందని ఆరోపణలున్నాయి. రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్న అతనితో మహిళలు సన్నిహితంగా వీడియోలు.. సోషల్ మీడియా చక్కర్లు కొడుతున్నాయి. వీటితో పాటు ఇతరాత్ర తీవ్రమైన ఆరోపణలు త్వరలో బహిర్గతం కానున్నట్లు విస్తృతంగా ప్రచారం జరుగుతోంది. మరో వైపు మద్యం కేసుతో పాటు ఇతర ఆరోపణల నుంచి తప్పించుకునేందుకు రవికుమార్ రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

# వసూళ్లపై శ్రద్ధ.. దేవుడిపై అశ్రద్ధ

- ప్రవేశం వద్ద గణపతికి అపచారం
- రూ.కోట్ల ఆదాయం.. కొరవడిన భద్రత
- గరుడ అయోధ్య రామాలయం నమూనా మూసివేత?

**ఏయూ క్యాంపస్:** బీచ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన గరుడ అయోధ్య రామాలయం నమూనా.. ఇప్పుడు తీవ్ర వివాదాలకు కేంద్ర బిందువుగా మారింది. కేవలం ధనార్జనే లక్ష్యంగా, భక్తుల భద్రతను, మత విశ్వాసాలను గాలికొదిలేశారని నిర్వాహకులపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ప్రారంభం నుంచి సోషల్ మీడియా ప్రచారంతో భారీ సంఖ్యలో భక్తులు ఈ నమూనా ఆలయాన్ని సందర్శించారు. అర కిలో మీటరు పొడవునా, మూడు వరుసలతో కూడిన భారీ క్యూలు ఏర్పాటు చేసి టికెట్లు విక్రయించడంపై పెట్టిన శ్రద్ధ, భక్తుల భద్రతపై ఏమాత్రం చూపలేదని స్పష్టమవుతోంది. వేలాది మంది ప్రజలు నిత్యం సందర్శించే ఇంత పెద్ద నిర్మాణంలో అగ్ని ప్రమాద నివారణ చర్యలు నామమాత్రంగా ఉన్నాయి. కేవలం రెండు అగ్నిమాపక సిలిండర్లను మాత్రమే ఉంచడం నిర్వాహకుల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనం. ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే జరగబోయే నష్టాన్ని ఊహించడానికే భయానకంగా ఉంది.

**గణపతికి ఘోర అవమానం**

దేవుడి పేరు చెప్పి దాదాపు రెండు నెలల కాలంలో నిర్వాహకులు రూ.కోట్లు సంపాదించారు. అయితే దేవుడి పట్ల కనీసం గౌరవం లేకుండా నిర్వాహకులు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల ఆలయ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలపై పత్రికల్లో, సామాజిక మాధ్యమాల్లో కథనాలు రావడంతో నిర్వాహకులు హడావిడిగా రుసుంతో కూడిన చెప్పుల స్టాండ్‌ను తొలగించారు. అయితే భక్తులకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా.. ప్రవేశ ద్వారం వద్ద ఉన్న వినాయకుడి ఫొటో చుట్టూ చెప్పులు విడవాలని సిబ్బంది సూచించడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఇది హిందువుల మనోభావాలను దెబ్బతీయడమే కాక, విఘ్నాలకు అధిపతి అయిన గణపతిని అవమానించడమేనని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**కల్యాణం టికెట్ల సంగతేంటి?**

ఈ నెల 29న రామకల్యాణం నిర్వహిస్తామని విస్తృతంగా ప్రచారం చేసి, నిర్వాహకులు టికెట్లను విక్రయించారు. అయితే భద్రాచలం దేవస్థానం పేరును దుర్వినియోగం చేస్తున్నారని ఆ ఆలయ ఈవో పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ కార్యక్రమం నిలిచిపోయింది. తాము ఎలాంటి పోస్టర్లు ముద్రించలేదని మొదట బుకాయించిన నిర్వాహకులు.. నగరవ్యాప్తంగా 250 ఫ్లెక్సీలు, 5 వేల పోస్టర్లు అతికించినట్లు ఒప్పుకున్న వాయిస్ రికార్డులు బయటకు వచ్చాయి. పోలీసులు జరిపిన విచారణలో కల్యాణం టికెట్లు కూడా లభ్యమైనట్లు సమాచారం. దీంతో టికెట్లు కొన్న వారికి డబ్బులు తిరిగి చెల్లిస్తారా లేదా అనే దానిపై అనిశ్చితి నెలకొంది.



గణపతి ఫొటో చుట్టూ పెట్టిన చెప్పులు

**సందర్శన నిలిపివేత**

వివాదం ముదురుతుండటంతో శుక్రవారం సాయంత్రం విద్యుత్ దీపాలు ఆపివేసిన నిర్వాహకులు సందర్శకులను మాత్రం అనుమతించారు. రాత్రి 8 గంటల తర్వాత నమూనా ఆలయంలోకి సందర్శనను పూర్తిగా నిలిపివేశారు. ఈ వ్యవహారం పెద్దదై..కొన్ని రాజకీయ పార్టీల నేతల మెడకు చుట్టుకునే అవకాశం ఉండటంతో సందర్శన నిలిపివేసినట్లు తెలిసింది. ఇంత జరుగుతున్నా నిర్వాహకులు ఎక్కడా కనిపించడం లేదు. శనివారం నుంచి సందర్శన లేదని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నా.. నిర్వాహకుల నుంచి మాత్రం అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

# సీబీఐ చేతికి బెంగాల్ విద్యార్థిని మృతి కేసు

- రెండేళ్ల కిందట హాస్టల్ భవనంపై నుంచి పడి ఆకాష్ బైజూస్ విద్యార్థిని మృతి
- ఆమె మృతి విషయంలో పోలీసుల దర్యాప్తుపై తండ్రి అనుమానాలు
- తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు

**విశాఖ సిటీ:** విశాఖలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థిని అనుమానాస్పద మృతి కేసు మరో మలుపు తిరిగింది. రెండేళ్ల క్రితం దొండపర్తిలో కాలేజ్ హాస్టల్ భవనం పై నుంచి పడి మృతి చెందిన విద్యార్థిని కేసు ఇప్పుడు సీబీఐ చేతికి చేరింది. ఈ కేసు అప్పట్లో విశాఖలో సంచలనం సృష్టించింది. కాలేజీ యాజమాన్యంతో పోలీసులు కుమ్మక్కయ్యారని, సాక్ష్యాలను తారుమారు చేసి, ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని మృతురాలి తండ్రి చేసిన ఆరోపణలు అప్పట్లో హాట్ టాపిక్ అయ్యాయి. తాజాగా ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలివ్వడంతో మరోసారి ఈ కేసు దర్యాప్తు విశాఖ నుంచి ప్రారంభం కానుంది.

**కుమార్తె మృతిపై తండ్రి అనుమానాలు**

పశ్చిమ బెంగాల్‌కు చెందిన విద్యార్థిని నీట్ శిక్షణ కోసం విశాఖలో ఆకాష్ బైజూస్ కాలేజ్‌లో చేరింది. 2023, జూలై 14న రాత్రి దొండపర్తిలో కాలేజీ నిర్వహిస్తున్న సాధన హాస్టల్ భవనంపై నుంచి పడిపోగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ 17న మృతి చెందింది. పోలీసులు ముందు ఆమెది ఆత్మహత్యగా పేర్కొంటూ కేసు నమోదు చేశారు. తర్వాత విచారణలో హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యం ఉందని కాలేజీకి చెందిన ఇద్దరిని, హాస్టల్‌కు చెందిన మరో ఇద్దరిని అరెస్టు చేశారు. ఆమె మృతిపై తండ్రి సుఖ్‌దేవ్ సాహా అనేక అనుమానాలు వ్యక్తం చేశారు. పోలీసుల దర్యాప్తు తీరు సక్రమంగా లేదని, కాలేజీ యాజమాన్యంతో కుమ్మక్కైపోయారని ఆరోపణలు చేశారు. సీసీ కెమెరా పరిశీలిస్తే తన కుమార్తె బిల్డింగ్‌పైకి వెళ్లినప్పుడు ఒక కలర్ డ్రెస్ ఉందని, కింద పడిన తర్వాత మరో కలర్ డ్రెస్ ఉందని అనుమానం వ్యక్తం చేశారు.

**విశాఖ పోలీసులపై బెంగాల్‌లో ఫిర్యాదు**

మృతురాలి తండ్రి పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీని కలిసి విశాఖ పోలీసుల వ్యవహార శైలిపై ఫిర్యాదు చేశారు. దీంతో సీఎం మమతా కోల్‌కత్తాలోని నేతాజీనగర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేయాలని ఆదేశించారు. ఆ కేసును అక్కడి సీఐడీకి అప్పగించారు. వారు నగరానికి వచ్చి మూడు రోజుల పాటు దర్యాప్తు చేపట్టారు. అప్పటి వరకు ఆత్మహత్యగా ఉన్న సెక్షన్లను మార్చారు.

**సీఐ, ఎస్ఐలపై వేటు**

ఈ కేసుపై పశ్చిమ బెంగాల్ సీఎం ప్రత్యేక దృష్టి పెట్టడంతో పోలీసులపై ఒత్తిడి పెరిగింది. అప్పటివరకు సీఐ దర్యాప్తు అధికారిగా ఉండగా కేసును ఏసీపీకి అప్పగించారు. అలాగే సీఐ, ఎస్ఐలను రేంజ్‌కు పంపించారు. ఇంతలో సుఖ్‌దేవ్ సాహా హైకోర్టును ఆశ్రయించారు. తన కుమార్తె మరణంపై అనుమానాలు ఉన్నాయని, సాక్ష్యాలు తారుమారు చేసే అవకాశం ఉన్నందున సీసీ కెమెరా ఫుటేజ్ కావాలని కోరారు. దీనిపై హైకోర్టు.. అడ్వకేట్ కమిషనర్‌ను సైతం నియమించింది. వారు వచ్చి ఇక్కడి ఆధారాలను సేకరించి హైకోర్టుకు అదే ఏడాది ఆగస్టు 28న అందజేశారు.

**సిటీ పోలీసులకు తలనొప్పులు**

ఈ కేసు ఇంకా విశాఖ పోలీసులను వీడలేనట్లు కనిపిస్తోంది. తాజాగా సుప్రీంకోర్టు ఈ కేసును సీబీఐకి అప్పగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో విద్యార్థిని మృతిపై సీబీఐ విశాఖకు వచ్చి దర్యాప్తు చేపట్టే అవకాశముంది. ఇప్పుడు మళ్లీ అప్పటి పోలీసుల వ్యవహార శైలిపై ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయన్న చర్చ పోలీస్ శాఖలోనే జరుగుతోంది.

# సైనికులే నిజమైన హీరోలు

**ఆకట్టుకున్న 'భారతీయం'**



అలరించిన నృత్య రూపకం



**మద్దిలపాలెం:** కళాభారతి ఆడిటోరియంలో కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శనివారం 'భారతీయం' పేరిట అద్భుతమైన సాంస్కృతిక కార్యక్రమం జరిగింది. సైనిక సంక్షేమ శాఖ, యాక్మీ ఈవెంట్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలు నృత్యరూపక ప్రదర్శనలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. అమరవీరుల త్యాగాలను వివరిస్తూ చేసిన నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను కదిలించాయి. ముందుగా జిల్లా సైనిక సంక్షేమ అధికారి కెప్టెన్ సత్య ప్రసాద్, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ విశాఖ మహానగర్ సంఘ చాలక్ పి.వి.నారాయణ రావు, పారిశ్రామికవేత్త సుబోధ్ రాకేచా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ.. దేశ రక్షణకు సైనికులు చేస్తున్న త్యాగం, వారి ధైర్యసాహసాలు, కఠోర శ్రమ అసామాన్యమని ప్రశంసించారు. సైనికులను గౌరవిస్తూ ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కళావేదిక గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కమల్ బైద్ మాట్లాడుతూ సైనికుల త్యాగాలు మరువలేనివని, వారిని గౌరవించుకోవడం మనందరి బాధ్యత అని అన్నారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని కాపాడుతున్న సైనికుల సేవలు వెలకట్టలేనివని, నిజమైన హీరోలు సైనికులేనని పేర్కొన్నారు. పి.వి. నారాయణరావు మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతం చేయడంలో సైనికుల పాత్ర అమోఘమని కొనియాడారు. అనంతరం పలువురిని ఘనంగా సత్కరించారు. ఇంద్రజాలికుడు కాజా ప్రదర్శించిన పలు విన్యాసాలు సభికులను ఎంతగానో అలరించాయి. వాకర్స్ ఇంటర్నేషనల్ జిల్లా గవర్నర్ కె. ద్వారకానాథ్, జనకులం ఫౌండేషన్ ధర్మకర్త సి.హెచ్. శ్రీనివాసరాజు, కార్యదర్శి డాక్టర్ రజని తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

# వీరుడా.. వందనం

**బీచ్‌రోడ్డులో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహణ**



కార్గిల్ విజయ్ దివస్‌లో పాల్గొన్న కలెక్టర్, సీపీ, నేవీ అధికారులు

**ఏయూక్యాంపస్:** బీచ్ రోడ్‌లోని విక్టరీ ఎట్ సీ స్మారకం వద్ద శనివారం కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్ పాల్గొని అమరవీరులకు పుష్పాంజలి ఘటించారు. కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీజీఎన్‌పీ వైస్ అడ్మిరల్ బి.శివకుమార్, ఇతర సీనియర్ అధికారులు, విశ్రాంత సైనికోద్యోగులు పాల్గొన్నారు. దేశం కోసం ప్రాణాలర్పించిన వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అలాగే భారతీయ యువ మోర్చా ఆధ్వర్యంలో బీచ్‌రోడ్‌లో ర్యాలీ నిర్వహించారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులకు నివాళులర్పించారు. భారత సైనిక పరాక్రమాన్ని చాటే విధంగా కార్గిల్ విజయం నిలిచిందని నినదించారు. వీరుల త్యాగాలను వెలకట్టలేమన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# అనుమతులు వచ్చేంత వరకు పనుల నిలుపుదల

**జెడ్సీ కనకమహాలక్ష్మి**

సాక్షి ఎఫెక్ట్..

**మధురవాడ:** ప్లాన్, ఇతర అనుమతులు వచ్చే వరకు అయోధ్యనగర్‌లో నిర్మాణపనులు నిలుపుదల చేస్తున్నట్లు జీవీఎంసీ జోన్-2 కమిషనర్ కె. కనక మహాలక్ష్మి, ఏసీపీ తిరుపతిరావు తెలిపారు. 7వ వార్డు అయోధ్యనగర్ గ్లోబ్ స్కూల్ ఎదురుగా రిసార్ట్ పేరుతో చేపడుతున్న భారీ నిర్మాణాన్ని వారు పరిశీలించారు. ఇక్కడ ఫంక్షన్ హాల్ పేరిట భారీ రిసార్ట్ నిర్మాణపనులు చేపట్టారు. ప్లాన్, వీఎల్‌టీ తదితర అనుమతులేవీ లేకుండా, ప్లానింగ్ సెక్రటరీ పనులు ఆపాలని చెప్పినా ఖాతర్ చేయకుండా పనులు కొనసాగిస్తున్నారు. పైగా నిర్మాణపనులకు విద్యుత్‌శాఖ అండర్ గ్రౌండ్ కేబుల్ నిర్మాణానికి ఉపయోగించే పలకలు వాడుతున్న వైనంపై సాక్షిలో శుక్రవారం 'ప్రైవేట్ రిసార్ట్ నిర్మాణంలో విద్యుత్ శాఖ పలకలు..!' శీర్షికన ప్రచురితమైన కథనంపై జోనల్ అధికారులు స్పందించి, పనులు పరిశీలించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఉన్నారు. అయితే, ఇక్కడ పనుల్లో ఈపీడీసీఎల్ సామగ్రి వాడుతున్న విషయం విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు అటువైపు కన్నెత్తయినా చూడకపోవడం విమర్శలకు తావిస్తోంది.

# సింహగిరిపై రూ. 9,500లకే వివాహ ప్యాకేజీ

**సింహాచలం:** సింహాచలంపై పెళ్లి చేసుకోవాలనుకునే జంటలకు కేవలం రూ. 9,500లకే సమగ్ర వివాహ ప్యాకేజీని అందిస్తామని వీహెచ్‌పీ ప్రకటించింది. ఈ ప్యాకేజీలో డెకరేషన్ మండపం, పురోహితులు, లైటింగ్, మేళం వంటి సేవలు ఉంటాయని, ఎన్ని పెళ్లిళ్లు జరిగినా ఎలాంటి కొరత లేకుండా వాటిని సమకూరుస్తామని తెలిపింది. ఈ విషయాన్ని దేవస్థానం ఈవోకు ఇప్పటికే తెలియజేశామని వీహెచ్‌పీ నాయకుడు పూడిపెద్ది శర్మ, జిల్లా సామాజిక సమరసత అభియాన్ ప్రముఖ్ మీసాల రవీంద్ర తెలిపారు. అతి తక్కువ ధరలకే వివాహాలు చేసుకునేందుకు అనుకూలమైన వ్యవస్థను తయారు చేయాలని ఈవో కోరడంతో.. తాము రూ. 9,500 ప్యాకేజీని లిఖితపూర్వకంగా ప్రతిపాదించినట్లు తెలిపారు. ఈ ధరలో డెకరేషన్ మండపం, పురోహితులు, లైటింగ్, మేళం వంటివన్నీ ఉంటాయని వీహెచ్‌పీ పేర్కొంది.

# మెట్రో, రైలు ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం

**కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఆదేశం**

**మహారాణిపేట:** జిల్లా పరిధిలో తలపెట్టిన మెట్రో రైలు ప్రాజెక్టు, సాధారణ రైల్వే లైన్ల విస్తరణ, ఇతర పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ మీటింగ్ హాలులో జరిగిన సమావేశంలో ఆయన మెట్రో రైలు, సాధారణ రైల్వే లైన్ విస్తరణ, ఇతర అవసరాల కోసం చేపట్టాల్సిన భూసేకరణ, నోటిఫికేషన్ల జారీ, ఇతర అంశాలపై సమీక్షించారు. విశాఖపట్నం-గోపాలపట్నం మధ్య నిర్మించనున్న 3వ, 4వ లైన్లు, పెందుర్తి- సింహాచలం నార్త్ స్టేషన్ మధ్య ఫ్లైఓవర్ నిర్మాణం, వడ్లపూడి జంక్షన్, గాజువాక కణితి రోడ్డు, దువ్వాడ-సింహాచలం లైన్ల మధ్య చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై ప్రధానంగా చర్చించారు. ఎంత మేరకు భూమి అవసరం, ఇప్పటివరకు ఏం చర్యలు చేపట్టారు? వంటి అంశాలపై కలెక్టర్ ఆరా తీశారు.

**మెట్రో రైలు ప్రాజెక్టు పనులు, పునరావాసంపై దృష్టి**

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్టు ఫేజ్-1లో భాగంగా మూడు కారిడార్లలో చేపట్టనున్న పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై చర్చించిన కలెక్టర్.. సంబంధిత అధికారులకు పలు అంశాలపై మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ్యంగా ఫారం-2 నోటిఫికేషన్ల ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని, నివేదికలను నిర్ణీత సమయంలో సమర్పించాలన్నారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రభావిత కుటుంబాల పునరావాసం, పునర్నిర్మాణ పథకానికి సంబంధించి నిర్వహించాల్సిన సామాజిక సర్వేపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేట్ భూములను గుర్తించి తదుపరి చర్యలు చేపట్టాలన్నారు. స్ట్రక్చరల్ అవసరాలకు అనువైన 9.22 ఎకరాల ప్రైవేటు భూమి సేకరణపై వ్యూహాత్మకంగా వ్యవహరించాలని, నిబంధనలను అనుసరించి ముందుకు వెళ్లాలని ఆదేశించారు. జేసీ కె.మయూర్ అశోక్, డీఆర్వో బి.హెచ్. భవానీ శంకర్, విశాఖ ఆర్డీవో పి. శ్రీలేఖ, ప్రత్యేక ఉప కలెక్టర్ సుధాసాగర్, టూరిజం అధికారి మాధవి, డీటీలు పాల్గొన్నారు.

**వీఎంఆర్డీఏ మాస్టర్ ప్లాన్ రోడ్లను వేగవంతం చేయండి**

వీఎంఆర్డీఏ పరిధిలో చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. భూసేకరణ, టెండర్లు, టీడీఆర్‌ల జారీ ప్రక్రియలను నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో వీఎంఆర్డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఎన్.హెచ్.ఎ.ఐ. పీడీ ప్రభాకర్, ఆర్ అండ్‌బీ ఎస్‌ఈ, ఇతర అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్షించారు. మాస్టర్ ప్లాన్‌లో భాగంగా అనకాపల్లి, విజయనగరం, పాత, కొత్త జాతీయ రహదారులకు, బీచ్ కారిడార్‌లకు అనుసంధానం చేస్తూ 25 కొత్త రోడ్లను నిర్మించనున్నట్లు వీఎంఆర్డీఏ కమిషనర్ తెలిపారు. వీటిలో ఏడింటికి టెండర్లు పూర్తయ్యాయని, మిగిలిన వాటికి త్వరలోనే టెండర్లు పిలుస్తామన్నారు. సెప్టెంబర్ రెండో వారం నుంచి పనులు మొదలు పెట్టాలని కలెక్టర్ నిర్దేశించారు. వచ్చే గిరి ప్రదక్షిణలోగా హనుమంతువాక, వెంకోజీపాలెం కూడళ్ల వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని ఎన్.హెచ్.ఎ.ఐ. ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్‌కు సూచించారు.



సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ హరేందిర ప్రసాద్, చిత్రంలో జేసీ మయూర్ అశోక్,డీఆర్వో భవానీశంకర్

**సచివాలయ పరిధిలో 10 మంది మార్గదర్శకుల గుర్తింపు**

ప్రతి గ్రామ/వార్డు సచివాలయ పరిధిలో 10 మంది మార్గదర్శకులను గుర్తించాలని కలెక్టర్ సూచించారు. శనివారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బంగారు కుటుంబాల కోసం కొంత సమయం కేటాయించగలిగి ఆర్థికంగా, విద్యాపరంగా, ఆరోగ్యపరంగా ఆదుకోగలిగిన వారిని గుర్తించాలన్నారు. వారిని బంగారు కుటుంబాలతో మ్యాపింగ్ చేయాలన్నారు. సోమవారం నాటికి మార్గదర్శులను గుర్తించి, మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఆగస్టు 15 నాటికి ఈ ప్రక్రియ పూర్తి కావాలన్నారు. పెద్ద పరిశ్రమలు, మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రులు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఎక్కువ మంది బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలన్నారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై అపోహలొద్దు

**దాబాగార్డెన్స్:** విద్యుత్ స్మార్ట్ మీటర్ల బిగింపుపై ఎటువంటి అపోహలొద్దు.. వీటి వల్ల వినియోగదారులపై ఎలాంటి అదనపు చార్జీల భారం ఉండదని ఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాస రావు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారుల సేవల్లో పారదర్శకతను మరింత పెంచేందుకు ఆర్‌డీఎస్ఎస్ పథకంలో భాగంగా అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. ప్రస్తుత మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను మార్చాలనే ప్రతిపాదనకు ఏపీ ఈఆర్సీ ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. స్మార్ట్ మీటర్లు పాత మీటర్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగాన్ని నమోదు చేయవని, వీటి కారణంగా బిల్లులు పెరిగే ప్రసక్తి లేదన్నారు.

